సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 29 । జనవరి । 2025



సూపర్ సిక్స్‌పై మాట తప్పిన బాబు

సూపర్ సిక్స్ పథకాలపై ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు మాట తప్పారని వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి విమర్శించారు. -8లో



టీడీపీ సర్పంచ్ ఐపీ బాంబు

పుల్లంపేట మండలంలోని అనంతంపల్లి సర్పంచ్ జయరామకృష్ణారెడ్డి అలియాస్ మురళి రూ.53 లక్షలకు పైగా అప్పులు తీసుకుని ఐపీ పెట్టాడు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 40 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మార్కెట్ కమిటీ చైర్మన్ రిజర్వేషన్లు మార్పు

బి.కొత్తకోట: జిల్లాలోని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ నూతన పాలక వర్గ చైర్మన్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేసి అధికారులు ప్రకటించగా.. తాజాగా మళ్లీ వాటిలో మార్పు చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. తంబళ్లపల్లి నియోజకవర్గం బి.కొత్తకోట (అంగళ్లు) చైర్మన్ ఎస్సీ మహిళ, ములకలచెరువు చైర్మన్ బీసీ మహిళ, రాజంపేట చైర్మన్ ఎస్టీ జనరల్, రైల్వేకోడూరు చైర్మన్ ఓసీ మహిళ, రాయచోటి చైర్మన్ బీసీ జనరల్, లక్కిరెడ్డిపల్లి చైర్మన్ ఓసీ జనరల్, మదనపల్లి చైర్మన్ ఓసీ మహిళ, వాల్మీకిపురం చైర్మన్ ఓసీ జనరల్, కలికిరి చైర్మన్ ఎస్సీ మహిళ, పీలేరు చైర్మన్ బీసీ జనరల్‌కు కేటాయించారు.

రేపటిలోగా తత్కాల్-2 ఉపయోగించుకోవాలి

రాయచోటి జగదాంబసెంటర్: ఇంటర్మీడియెట్ బోర్డు విద్యార్థుల సౌకర్యార్థం ఇచ్చిన తత్కాల్-2ను ఈ నెల 30లోగా ఉపయోగించుకోవాలని డీఐఈఓ ఈశ్వరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా ఎవరికైతే పరీక్ష ఫీజు చెల్లించలేదో వారందరికీ రెండు రోజుల లోపు చెల్లించాలని తెలిపారు. తత్కాల్ ఫీజు రూ.3 వేలు ప్లస్ పరీక్ష ఫీజు రెండూ కలిపి కాలేజీ లాగిన్‌లో ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు. తత్కాల్-2లో పరీక్ష ఫీజు చెల్లించిన వారందరూ కూడా అన్నమయ్య జిల్లా కేంద్రంలో పరీక్ష రాయవలసి ఉంటుందని వివరించారు.

ప్రిన్సిపాల్, ఏఎన్‌ఎంల సస్పెన్షన్

రాయచోటి: మొలకలచెరువు కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శిల్ప, ఏఎన్ఎం బి.అశ్వినీలను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. మంగళవారం సాయంత్రం అన్నమయ్య జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి వెలువడిన ఉత్తర్వులలో.. పాఠశాలలో జరిగిన అవినీతి ఆరోపణలపై విచారణ అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పత్రికలలో ప్రత్యేకమైన వార్తల పట్ల స్పందించి విద్యాశాఖ అధికారులతో పూర్తి స్థాయిలో విచారణ చేయించామన్నారు. విద్యార్థుల పట్ల బాధ్యతలు మరచి ప్రవర్తించడం, విధి నిర్వహణలో నెలకొన్న లోపాల పట్ల బాధ్యులైన వారిద్దరిపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా ములకల చెరువు మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ)లో సామాజిక తనిఖీ సందర్భంగా బయటపడ్డ నిజాలపై ప్రజా సంఘాల స్పందనతోపాటు పత్రికలు ప్రచురించిన విషయం తెలిసిందే.

పంటకు ఈకేవైసీ తప్పనిసరి



పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్

కలకడ: సాగు చేసిన పంటలకు రైతులు విధిగా ఆన్‌లైన్ పద్ధతిలో ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.చంద్ర నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని కె.దొడ్డిపల్లె, రాతిగుంటపల్లె, ఎనుగొండపాళ్యం పంచాయతీలలో ఆయన పర్యటించారు. రబీ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ, కంది, ఇతర పంటలను పరిశీలించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలోని సిబ్బంది విధిగా పంటల నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంకేతిక నిపుణులు వెంకటమోహన్, ఏఓ యం.వి.లావణ్య పాల్గొన్నారు.

జంబోరి వేడుకలకు జిల్లా విద్యార్థులు



జంబోరి వేడుకలకు హాజరైన స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు, విద్యార్థులు

రాయచోటి జగదాంబసెంటర్: తమిళనాడులోని తిరుచురాపల్లిలో నిర్వహించనున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ జంబోరి వేడుకలకు అన్నమయ్య జిల్లా స్కౌట్స్ విద్యార్థులు వెళ్లారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి దాదాపు 25 వేల మంది హాజరయ్యే ఈ వేడుకలను ఈ నెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 3 వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా సెక్రటరీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో 4 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జాతీయ జంబోరి అనేది విద్యార్థులకు ఒక పండుగ లాంటిదన్నారు. ఇందులో ఇతర దేశాలతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, ఫుడ్ ఎగ్జిబిషన్, మార్చ్ పాస్ట్, యోగ, క్యాంప్ ఫైర్ తదితర విభాగాల్లో విద్యార్థుల మధ్య పోటీ ఉంటుందన్నారు. అన్నమయ్య జిల్లా నుంచి ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసి పంపడం జరిగిందన్నారు.




పేదల ఇళ్లపై పిడుగు!

- జగనన్న గృహ నిర్మాణాలకు 'చంద్ర' గ్రహణం
- బిల్లులకు మార్చి 31 డెడ్‌లైన్
- ఆ తర్వాత చెల్లింపులు ఉండవ్
- సొంతంగా నిర్మించుకోవాల్సిన పరిస్థితి



బి.కొత్తకోట జగనన్న లేఔట్‌లో ఇళ్ల నిర్మాణాలు



బి.కొత్తకోట: వైఎస్సార్‌సీపీ హయాంలో పేదలకు మంజూరు చేసిన ఇళ్లకు మార్చి 31 తర్వాత పైసా బిల్లు ఇచ్చేది లేదని కూటమి ప్రభుత్వం తేల్చి చెప్పడంతో పేదల నెత్తిపై పిడుగు పడినట్లయ్యింది. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రారంభించిన ఇళ్లను పూర్తి చేసుకోకుండానే బిల్లులు నిలిపివేస్తే ఎలా అనే ఆందోళన వ్యక్తం అవుతోంది. లక్షల విలువైన స్థలాలను ఉచితంగా ఇచ్చి, నిర్మాణ యూనిట్ విలువ రూ.1.80 లక్షలను తిరిగి చెల్లించే అవసరం లేకుండా ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిది. ఎంతో సమున్నత ఆశయంతో గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ పక్కా గృహాలను మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోవాల్సిందేనా అనే ప్రశ్న తలెత్తుతోంది.

ఇకపై బిల్లులు నిలిపివేత

మార్చి 31లోపు జిల్లాలో చేపట్టి, వివిధ స్థాయిల్లోని పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి చేయించుకోవాలని గృహ నిర్మాణ శాఖ ఉత్తర్వు జారీ చేసింది. నిర్మాణ పనులు చేసుకుంటున్న పేదలు ఇంటి స్థాయి ఎంతుందో అక్కడికే, ఆ తేదీ నాటికి బిల్లును పొందవచ్చు. మార్చి 31 తర్వాత పైసా ఆర్థిక సాయం అందదని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వడం జరగదని స్పష్టం చేశారు. అంటే గడువు దాటాక పేదలే అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ గడువు లోపు నిర్మాణాలు చేసుకున్న లబ్ధిదారులు బిల్లులు పొందాలి, లేదంటే నిర్మించుకున్న ఇంటికి బిల్లు లేనట్టే. ఈ నిర్మాణ పనులకు పేదలే సొంత డబ్బుతో పూర్తి చేయించుకునే పరిస్థితుల్లో లేరు.

సౌకర్యాలకు రూ.31.34 కోట్లు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న లేఔట్లలో పేదల ఇళ్ల నిర్మాణాలకు సౌకర్యాలను కల్పించింది. కోట్లు వెచ్చించి ఇబ్బందులను దూరం చేసి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన ప్రతి లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలకు వెనువెంటనే బిల్లులు చెల్లించింది. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో ఇళ్లు నిర్మించుకొంటున్న పేదలకు అవసరమైన నీటి కోసం రూ.31.34 కోట్లు కేటాయించింది. ఇందులో పట్టణ ప్రాంతాల్లోని లేఔట్లలో నీటి సరఫరా పనులు, బోర్లకు రూ.10.63 కోట్లు కేటాయించగా ఈ పనుల బాధ్యతను మున్సిపల్ ప్రజారోగ్యశాఖకు అప్పగించారు. గ్రామీణ ప్రాంత లేఔట్లలో నీటి వసతి, బోర్లు, పైప్‌లైన్లకు రూ.20.71 కోట్లు కేటాయించగా, ఈ పనుల బాధ్యతను గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు అప్పగించారు. 2022 చివరి నాటికే జిల్లాలో 66 లేఔట్లలో బోర్లు వేశారు. 24.33 కిలో మీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. స్తంభాలను ఏర్పాటు చేసి లైన్లు లాగి విద్యుత్ సరఫరా ఇచ్చారు. బోర్లు, మోటార్లు, పైప్‌లైన్‌కు సంబంధించి కోట్ల పనులు పూర్తి చేశారు.

అలసత్వం.. ఆపై నిర్లక్ష్యం

జూన్ 5 నుంచి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జగనన్న ఇళ్ల నిర్మాణాలపై నిర్లక్ష్యం చూపుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరై చేపట్టిన ఇళ్లనే కాకుండా అప్పటికి ప్రారంభం కాని ఇళ్లను కూడా ప్రారంభమైన జాబితాలో చేర్చిన కూటమి ప్రభుత్వం వాటి పనుల పూర్తికి మాత్రం కనీస ప్రాధాన్యత ఇవ్వలేదు. నిర్మాణాల పేరుతో టార్గెట్లు ఇచ్చినా క్షేత్ర స్థాయిలో పనులు వేగవంతం చేయించడం, గృహనిర్మాణాల పూర్తికి లబ్ధిదారులకు సహకారం అందించలేదు. ఫలితంగా జిల్లాలో కూటమి ప్రభుత్వంలో పూర్తి చేయించిన ఇళ్ల సంఖ్య అతి తక్కువే. గత ఏడు నెలల్లో ఇళ్ల లబ్ధిదారులకు చెల్లించిన బిల్లులు కేవలం రూ.14 కోట్లకు మించలేదంటే నిర్మాణాల పూర్తికి ఏ మేరకు కృషి చేశారో ఈ లెక్క చెబుతుంది. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.826 కోట్లు ఖర్చు చేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇళ్లకు 2024 జూన్ 3 వరకు చెల్లించిన నగదు

నియోజకవర్గాలు	నిధులు (రూ.లలో)
పీలేరు (రూరల్)	81,71,63,646
రాజంపేట (రూరల్)	90,35,48,467
రైల్వేకోడూరు	47,86,61,925
తంబళ్లపల్లె	113,06,36,277
పీలేరు(అర్బన్)	37,72,62,116
మదనపల్లె	144,29,96,841
రాజంపేట అర్బన్	18,98,27,780
రాయచోటి	166,87,01,125

చేపట్టిన మొత్తం ఇళ్ల సంఖ్య: 78,221

నగదు బిల్లులు చెల్లింపు: రూ.681,89,70,397

మెటీరియల్, నగదు కలుపుకొని: రూ.826,74,05,202

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో జరిగిన నిర్మాణాలు

- చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు: 78,221
- ప్రారంభం కానివి: 4,604
- బిలో బేస్‌మెంట్ లెవల్: 9,998
- బేస్‌మెంట్ లెవల్: 19,138
- బేస్‌మెంట్ లెవల్: 19,578
- లింటల్ లెవల్: 986
- రూఫ్ లెవల్: 5,681
- రూఫ్‌కాస్ట్: 2,913
- పూర్తయినవి: 34,906
- చెల్లించిన బిల్లులు: రూ.826 కోట్లు

బ్రహ్మోత్సవం.. ప్రారంభం



అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్: కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మయూరం కృష్ణ మోహన్, త్రివిక్రమ్‌లతోపాటు మరికొందరు వేద పండితులు దీక్షా తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత విశ్వక్సేనునికి పూజ చేసి పుణ్యాహవాచనం నిర్వహించారు. సాయంత్రం రక్షా కంకణధారణ నిర్వహించారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మృత్సంగ్రహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్ట మట్టిని పల్లకీలో ఊరేగింపుగా ఆలయానికి చేర్చి అంకురార్పణ నిర్వహించారు. ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించిన అంకురార్పణ కార్యక్రమాన్ని తిలకించేందుకు విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. టీటీడీ నుంచి వచ్చిన సూపరింటెండెంట్ హనుమంతయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమాచార్యుల కీర్తనలను ఆలపించి ఆకట్టుకున్నారు. అనంతరం సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. చివరగా హరికథా కాలాక్షేపం నిర్వహించారు.

నేడు ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాల్లోభాగంగా బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల్లోపుగా తిరుచ్చి, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారి సన్నిధిలో ఊంజల సేవ నిర్వహిస్తారు. ఇదే సమయంలో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు స్వామిపై కీర్తనలు ఆలపించనున్నారు. రాత్రి 6.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామిని కొలువుదీర్చనున్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తన సోదరుడు టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డితో కలిసి మంగళవారం మత్స్యశాఖ వారి ఆధ్వర్యంలో మండలంలోని వెలుగల్లు ప్రాజెక్టులో 4.80 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారులకు సబ్సిడీపై వలలు, బోట్లు, ఐస్ బాక్సులు, మోటార్ సైకిల్ ఇచ్చి ఆదుకోవడం జరుగుతుందన్నారు. గాలివీడు మండలంలో దాదాపు 300 కుటుంబాలు చేపల వృత్తిపై ఆధారపడి ఉన్నాయని, వారందరికీ తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. రాయచోటి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రాబోయే మూడు సంవత్సరాలలో వెలుగల్లు ప్రాజెక్టు ద్వారా నీరు సరఫరా చేసి నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 300 బోర్లు, మోటార్లు బిగించి గ్రామాలకు నీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ డీడీ సుస్మిత, తహసీల్దార్ భాగ్యలత, ఎంపీడీఓ జవహర్ బాబు, నీటిపారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వెలుగల్లు ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, అధికారులు

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

చిన్నమండెం: మండల పరిధిలోని నాగిరెడ్డిగారిపల్లెలో రూ.32 లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు వేయడం జరుగుతుందన్నారు. అనంతరం మంత్రి నాగిరెడ్డిపల్లెలో నీటి సమస్య పరిష్కారానికి నూతన బోరును ప్రారంభించారు. అంతకు మునుపు మంత్రి స్వగ్రామమైన బోరెడ్డిగారిపల్లెలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ అంతరాయాన్ని పరిష్కరించాలి

రాయచోటి టౌన్: రాష్ట్రంలోని ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ (ఫైబర్) అంతరాయం కలిగిస్తోందని, దీనిని త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఫైబర్ నెట్ ఆపరేటర్స్ ఫెడరేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఎస్ఎఫ్ఎల్ ద్వారా ప్రజలకు నిరంతరాయంగా నెట్ కనెక్షన్‌తోపాటు టీవీ, టెలిఫోన్ సౌకర్యం ఉందన్నారు. అయితే సుమారు నాలుగు నెలలుగా ఫైబర్ నెట్ వారికి, ఏపీ ట్రాన్స్‌కో వారికి మధ్య సమన్వయ లోపంతో తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీ ఫైబర్ ఆపరేటర్స్ ఫెడరేషన్ సభ్యులు

రిజిస్ట్రేషన్ ఫీజు పెంపుపై పునరాలోచించాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి: భూముల రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుపై పునరాలోచన చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రాయచోటిలో ఆయన మంగళవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. మూలిగేనక్కపై తాటికాయపడ్డ చందంగా తిరిగి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పకూలి పోయిందన్నారు. అలాగే నిర్మాణ రంగంపై ప్రభావం పడుతుందన్నారు. ఎనిమిది నెలల నుంచి పాలకులు ప్రజలకు మేలు చేయకుండా, వారి స్వార్థ ప్రయోజనాలు కోసమే ఆలోచిస్తున్నారన్నారు. రూ.14 లక్షల కోట్లను గత ప్రభుత్వం అప్పులు చేసిందని సీఎం చంద్రబాబు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ.. కేంద్ర ప్రభుత్వం రూ.6 లక్షల కోట్లుగా అప్పులు ఉన్నట్లు తేల్చిందన్నారు. ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేదని, తానేం చేయాలంటూ.. ఇచ్చిన హామీలను అమలు చేయలేమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే స్వయంగా చెప్పడంపై ఆయన చిత్తశుద్ధి అర్థమవుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకోవడం లేదన్నారు. సంపదను సృష్టించి తాము ప్రజలకు పంచుతామని అనేక సార్లు చంద్రబాబు చెప్పారన్నారు. చేతగాక ప్రజలపై భారాలు మోపుతారా అని ప్రశ్నించారు. అమరావతి పరిధిలో 29 గ్రామాలలో భూ ములు విలువ పెంచకుండా నిర్ణయం తీసుకున్నారన్నారు. అక్కడ మాత్రం వ్యాపారాలు జరిగి, మిగిలిన ప్రాంతాలలో జరగకుండా ఉంటే ఎలా అని నిలదీశారు. సంపద సృష్టి అంటే గతంలో రాయచోటిలో స్థలాల విలువలు భారీగా పెరిగి వ్యాపారాలు బాగా జరిగాయన్నారు. రూ.64 కోట్ల నిధులతో రింగ్ రోడ్డు నిర్మాణం జరిగితే పట్టణం చుట్టు పక్కల ప్రాంతాలకు రవాణా సౌలభ్యం జరిగిందన్నారు. ఫలితంగా రూ.10 నుంచి రూ.15 వేల కోట్ల మేర రియల్ ఎస్టేట్ వ్యాపారాలు జరిగాయన్నారు. ఆర్‌డీఓ స్థాయి లేని రాయ చోటి జిల్లా కేంద్రం కావడంతో పట్టణానికి చుట్టు పక్కల ఉండే భూములకు విలువలు పెరగడంతో సంపద పెరిగిందన్నారు. కేవలం అనుకూల మీడియాలలో పాలన గొప్పగా చేస్తున్నామని చెప్పుకోవడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచిందని, పన్నుల భారం భారీగా మోపిందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏ వర్గం ప్రజలు సంతోషంగా లేరన్నారు. ముఖ్యంగా నిర్మాణ రంగాన్ని దృష్టిలో ఉంచుకొని భూముల రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచకుండా యథావిధిగా కొనసాగించాలని కోరారు. అలాగే ఇచ్చిన జీఓను వెనక్కు తీసుకునేలా పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

కుర్చీ కోసం పోటాపోటీ

- మార్కెట్ కమిటీ పదవులపై కన్ను
- కూటమి పార్టీల్లో ఆధిపత్య పోరు
- ఎవరికి వారు దక్కించుకునే యత్నం



రాజంపేట: పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవుల కోసం పోటాపోటీ కొనసాగుతోంది. ఈ విషయంపై కూటమిలోని పార్టీల్లో ఆధిపత్య పోరు నడుస్తోంది. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఎవరికి వారు.. తమ పార్టీ అభ్యర్థులను తెరపైకి తీసుకు వస్తున్నారు. దీంతో రాజంపేట మార్కెట్ కమిటీ నియామకం కూటమిలో చిచ్చురేపుతోంది.

నియామక ఉత్తర్వులు జారీ

మార్కెట్ వ్యవసాయ కమిటీ చైర్మన్ పదవి ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. ఈ మేరకు జిల్లా కలెక్టరు నియామకానికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మన్‌తోపాటు ఐదుగురు లేక ఆరుగురు డైరెక్టర్లు ఉంటారు. రెండేళ్ల పాటు కమిటీ కొనసాగనుంది. నియామకానికి విధి విధానాలు ప్రవేశ పెట్టారు. ఆ మేరకు అగ్రికల్చర్ మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ చర్యలు చేపట్టనున్నది.

కమ్మ సామాజిక వర్గానికే టీడీపీ మొగ్గు

కమ్మ సామాజిక వర్గానికే టీడీపీ మొగ్గు చూపుతోంది. చైర్మన్‌గా డమ్మీని నియమించుకొని కమిటీ పగ్గాలను వైస్ చైర్మన్ చేతిలో ఉండేలా చేస్తున్నారు. కమ్మపల్లెల నుంచి నాయకున్ని తీసుకురావాలని టీడీపీ యోచిస్తోంది. డీబీఎస్‌పల్లె, కూచివారిపల్లె, మిట్టమీదపల్లె తదితర కమ్మపల్లెల చెందిన నాయకులు వైస్ చైర్మన్ కుర్చీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే టీడీపీలో నామినేటెడ్ పదవులు పొందాలని ఆరాట పడుతున్నారు. నియోజకవర్గంలో ప్రొటోకాల్ కలిగిన వాటిలో మార్కెట్ కమిటీ ఒకటి ఉండటం గమనార్హం. టీడీపీ నుంచి చమర్తి జగన్ మోహన్‌రాజు, సుగవాసి బాలసుబ్రమణ్యం మార్కెట్ కమిటీపై దృష్టి సారించారు. మిగిలిన నేతలు కూడా ఇదే వరుసలో ఉన్నారు.

కాపులకే కట్టబెట్టాలని జనసేన

కాపు(బలిజ) సామాజికవర్గ నేతలకే వైస్ చైర్మన్ పదవి కటబెట్టాలనే దిశగా జనసేన అడుగులు వేస్తోంది. చైర్మన్‌పై పెద్దగా దృష్టి సారించలేదు. ఇప్పటి వరకు జనసేన నుంచి ఎవరికీ నామినేటెడ్ పదవి రాలేదు. దీంతో జనసేన పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు యల్లటూరు శ్రీనివాసరాజు నియోజకవర్గంలో ఒకరికైనా నామినేటెడ్ పోస్టు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఆ దిశగా ఇదే అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.

కషాయ పార్టీ ప్రయత్నం

మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం బీజేపీ కన్ను వేసింది. కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్నప్పటికీ.. స్థానికంగా తమ పార్టీకి అన్యాయం జరుగుతోందనే ఆవేదన ఇక్కడి నేతల్లో ఉంది. చైర్మన్ ఎస్టీకి కేటాయించిన నేపథ్యంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర నాయకుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ స్నేహితుడు పి.మస్తానయ్య పేరును ప్రతిపాదిస్తున్నారు. ఇప్పటికే కూటమిలోని పార్టీ నేతలకు తెలియజేశారు. అయితే మస్తానయ్యకు ఇవ్వకుండా టీడీపీ తన డమ్మీ నేతను చైర్మన్ కుర్చీలో కూర్చోపెడుతుందా అనే అనుమానాలు బీజేపీలో వ్యక్తమవుతున్నాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగోతు రమేష్‌నాయుడు సన్నిహితుడిగా మస్తానయ్య మెలుగుతున్న సంగతి తెలిసిందే.

చైర్మన్‌గా డమ్మీ వ్యక్తి..

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్టీకి కేటాయించడంతో కూటమి పార్టీలు తమదైన శైలిలో పావులు కదుపుతున్నాయి. తమకు అనుకూలమైన వ్యక్తిని నియమించేందుకు కసరత్తు చేస్తున్నారు. చైర్మన్ పదవిలో డమ్మీ వ్యక్తిని కూర్చోబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. వైస్ చైర్మన్‌గా రాజంపేట మండలంలోని అగ్ర వర్ణాలకు చెందిన నేతను నియమించేలా ముందుకు వెళుతున్నారు. అయితే ఇందులో నందలూరు, పెనగలూరు మండలాలకు చెందిన వారు కూడా ఉండాల్సి వుంటుంది.

కలకడ కేంద్రంగా ఐటీసీ కొనుగోళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు

కలకడ: కలకడ కేంద్రంగా టమాట, మామిడి పంటలను కొనుగోలు చేసి.. ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేయడానికి రైతుల భాగస్వామ్యంతో ఐటీసీ సంస్థ ముందుకు వచ్చిందని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు తెలిపారు. కలకడలో అధికారులు, రైతులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్, ట్రెండ్స్ ఎన్‌జీఓ (ఐటీసీ అనుబంధ సంస్థ) ఎఫ్‌పీఓలుగా, రైతులు కమిటీలో డైరెక్టర్లుగా ఉంటారని పేర్కొన్నారు. తద్వారా వ్యాపార లావాదేవీలతోపాటు, పంట దిగుబడికి సలహాలు సూచనలు, మార్కెటింగ్‌కు అవసరమైన సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. పడమట మండలాలలో అధికంగా టమాట పంట సాగు చేసే రైతులు కెవిపల్లె, కలకడ, గుర్రంకొండ, మదనపల్లె మండలాల్లో ఉండటంతో కలకడను కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి, ఐటీసీ ప్రతినిధి భోజరాజు, రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్పెంటర్ ఆత్మహత్య


బాధితుడిని ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

కురబలకోట : కురబలకోట మండలంలో కార్పెంటర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు.. మండలంలోని కనసానివారిపల్లెకు చెందిన రవి (25) కార్పెంటర్‌గా పనిచే స్తున్నాడు. ఇటీవల వీరింటి విషయమై సమీప బంధువులతో మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో మనస్తాపానికి గురైన రవి సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి హుటాహుటిన అతన్ని ఉరి నుంచి తప్పించి 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తిరుపతి ఆసుపత్రికి రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

వేర్వేరు ఘటనల్లో..

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ నవోదయకాలనీకి చెందిన శ్రీనివాసులు కుమార్తె తేజ(22) అనారోగ్య కారణాలతో ఇంటివద్ద పురుగుమందు తాగింది. అదేవిధంగా కురబలకోట నాయనివారిపల్లెకు చెందిన మునీంద్ర భార్య కావ్య నందిని(31) భర్తతో గొడవపడి ఎలుకల మందు తాగింది. ఆయా ఘటనల్లో గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మదనపల్లె : గుర్తు తెలియని వ్యక్తి(45) మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. ఉదయం ఆర్టీసీ బస్టాండులో ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు లేపేందుకు ప్రయత్నించారు. అయినా చలనం లేకపోవడంతో టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు గుర్తు తెలియని వ్యక్తిని పరిశీలించగా, మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు తెలిపారు. నల్లని స్వెటర్ ధరించినట్లు చెప్పారు. మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మార్చురీ గదికి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఆగి ఉన్న లారీ చోరీ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని కుక్కలదొడ్డి వద్ద హైదరాబాదు నుంచి తిరుపతికి ఐరన్ లోడుతో వెళ్తున్న 12 చక్రాల లారీని ఆపి డ్రైవర్ కాలకృత్యాలు తీర్చుకుంటుండగా మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ మేరకు లారీ డ్రైవర్ బి.వెంకట రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నవీన్ బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

150 మద్యం బాటిళ్లు స్వాధీనం?

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ప్రధాన రహదారి వద్ద 150 మద్యం బాటిళ్లు అన్నమయ్య జిల్లా ప్రత్యేక అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అయితే నిందితుడిపై కేసు నమోదు చేయకుండా ఎక్సైజ్ అధికారులు, కొంతమంది నాయకులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

సూపర్ సిక్స్ పథకాలపై మాట తప్పిన చంద్రబాబు

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి


నేకనాపురంలో విలేకరులతో మాట్లాడుతున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

సిద్దవటం : సూపర్ సిక్స్ పథకాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట తప్పారని వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి విమర్శించారు. సిద్దవటం మండలంలోని నేకనాపురం గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన మాట తప్పడంలో చంద్రబాబు దిట్ట అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన 7 నెలల్లో ఎన్ని హామీలు నెరవేర్చారో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచానికి పాఠాలు చెప్పానని గొప్పలు చెప్పే చంద్రబాబు నాయుడుకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా అన్నారు. ఆర్థిక పరిస్థితి తెలిసి కూడా చంద్రబాబు ఎలా హామీలు ఇచ్చారని, ప్రజలను మరోసారి మోసం చేసేందుకేనా అని అడిగారు. చంద్రబాబు మాట్లాడే ప్రతి మాటా అసత్యాలేనన్నారు. కరోనా కాలంలో కూడా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ క్యాలెండర్ పెట్టి ప్రజలకు ప్రతి నెలా సంక్షేమ పథకాలు అందించామన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా, లంచం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వలంటీర్ల ద్వారా నేరుగా సంక్షేమ పథకాల డబ్బులు ప్రజల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి నేకనాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తిప్పారెడ్డి వెంకట సుబ్బారెడ్డి దిశ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సౌమిత్రి, నేకనాపురం సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కె.వి. సుబ్బయ్య, తిప్పారెడ్డి సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సుధ, ఎల్లారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

హామీలు అమలు చేయలేని అసమర్థ సీఎం

- సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు
- 40 ఏళ్ల అనుభవం ఏమైంది బాబూ?
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల



మాట్లాడుతున్న కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకు అలవిగాని హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక పథకాలు అమలు చేయలేను అని చేతులెత్తేసి, పేదలను మోసం చేసిన అసమర్థ ముఖ్యమంత్రి దేశంలో చంద్రబాబు నాయుడు ఒక్కడేనని వైఎస్సార్ సీపీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి రావడానికి ఇబ్బడి ముబ్బడిగా హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు మామూలే అని తెలిపారు. ఇప్పుడు చంద్రబాబు సీనియారిటీ ఏమైందని తెలిపారు. చంద్రబాబు అప్పుడు ఖజానా ఖాళీ చేసి దిగిపోయినా తరువాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తన పరిపాలనాదక్షతతో ఇచ్చిన మాట ప్రకారం 100 శాతం హామీలు మొదటి ఏడాదిలోనే అమలు చేశారని తెలిపారు. కరోనా కష్టకాలంలో కూడా ప్రజల కోసం అమలు చేసిన పథకాలు, ప్రభుత్వం ఆదుకొన్న తీరు ఇప్పటికీ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. కానీ చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయలేను అని చెప్పడం చూస్తుంటే పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్రభాగాన ఉన్నాడని చంద్రబాబే ఒప్పుకున్నట్లయిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన 8 నెలల్లో స్కాలర్‌షిప్‌లు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలకు పెంచుతామన్న జీతాలు లేవు, ఆరోగ్యశ్రీ లేదు, రైతులకు ఏమీ ఇవ్వలేదు, మహిళలకు, రూ.1500, ఉచిత బస్సు లేదు, సూపర్ సిక్స్ ఇలా ఏ పథకం అమలు చేయకుండా కేవలం మాయ మాటలు చెబుతూ వచ్చి ఏకంగా ఇప్పుడు చేతులెత్తేశారని ధ్వజమెత్తారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు పథకాలు అమలు చేసి వారిలో ఆత్మస్థైర్యం నింపితే... నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు పథకాలు అమలు చేయలేనని ప్రకటించి పేద ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. దీనికి తోడు గతంలో ఉన్న పథకాలు ఆపేసి, ఒక్క కొత్త పథకం కూడా అమలు చేయకుండా అప్పుల పేరు చెప్పి తప్పించుకోవాలంటే ప్రజలకు జవాబు చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు, జరిమానా


హత్యాయత్నం కేసులో జైలు శిక్ష పడిన అంత్యం సుబ్బయ్య, అంత్యం సురేష్‌కర్ణ అలియాస్ సురేష్

సిద్దవటం : సిద్దవటం మండలం మంగనవాండ్లపల్లె గ్రామంలో 2013లో జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు ముద్దాయిలకు ఐదేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ. 1000 జరిమానా విధిస్తూ బద్వేల్ అడిషనల్ అసిస్టెంటు సెషన్స్ జడ్జి వై.జె.పద్మశ్రీ తీర్పు ఇచ్చినట్లు సిద్దవటం ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సిద్దవటం మండలం మంగనవాండ్లపల్లె గ్రామానికి చెందిన నారపురెడ్డి యానాదిరెడ్డి, అతి తమ్ముడు ఎల్లారెడ్డి కలిసి వారి పొలంలో వేరుశనగ పంట వేసుకున్నారు. అయితే అంత్యం సుబ్బయ్య, అంత్యం సురేష్‌కర్ణ అలియాస్ సురేష్‌కు చెందిన ఆవులు, ఎనుములు వారి పొలంలో పడి మేశాయి. దీంతో ఎల్లారెడ్డి సుబ్బయ్య వద్దకు వెళ్లి ఆవులు, ఎనుములు తన పొలంలో పడి మేస్తున్నాయని చెప్పాడు. దీంతో సుబ్బయ్య ఎల్లారెడ్డిపై కత్తితో దాడిచేశాడు. అంతలోనే సుబ్బయ్య చేతిలో ఉన్న కత్తిని సురేష్ కర్ణ లాక్కొని ఎల్లారెడ్డిని పొడవడంతో తీవ్ర రక్తగాయమైంది. బాధితుడు గట్టిగా కేకలు వేయడంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. ఈ సంఘటనపై అప్పటి హెడ్ కానిస్టేబుల్ పి. దస్తగిరి కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎస్. గురునాథ్ విచారణ చేపట్టారు. ప్రస్తుత సిద్దవటం ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరిచారు. దీంతో మంగళవారం బద్వేలు అడిషనల్ అసిస్టెంటు సెషన్స్ కోర్టు జడ్జి వై.జె. పద్మశ్రీ విచారణ జరిపి నేరం రుజువు కావడంతో ఈ కేసులోని ఇద్దరు ముద్దాయిలకు ఒక్కొక్కరికి సెక్షన్ 235(2) సీఆర్‌పీసీ మేరకు ఐదేళ్ల సాధారణ జైలు శిక్ష అలాగే ఒక్కొక్కరికి రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. సాక్ష్యాధారాలతో నేరం రుజువుచేసి శిక్షపడేలా కృషి చేసిన బద్వేల్ ఏపీపీ కె. రవికుమార్, పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్‌కుమార్ అభినందించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం కొత్తపల్లె పంచాయతీ దండువారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు ఎం.వెంకటేష్(24) అంగళ్లులోని మిట్స్ కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. మంగళవారం ఆటోలో కళాశాలకు వెళుతుండగా, మార్గమధ్యంలోని కొత్తపల్లె వద్ద ఆటోలో నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా కృష్ణప్ప భార్య అంబిక(35) కూలి పనులకు వెళ్లి సాయంత్రం ఆటోలో తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలోని రంగసముద్రం వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ఆటో రోడ్డుపక్కకు ఒరగడంతో ఆమె ఆటోలో నుంచి కిందపడి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అదేవిధంగా మదనపల్లె కురవంక పంచాయతీ భువనేశ్వరినగర్‌లో నివాసం ఉన్న ఉపాధ్యాయుడు బ్రహ్మానందం, ములకలచెరువు మండలం రంగసముద్రం పాఠశాలలో పనిచేస్తున్నారు. మంగళవారం సాయంత్రం విధులు ముగించుకుని మదనపల్లెకు వస్తుండగా, పెద్దపాలెం గేటువద్ద ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

టీడీపీ సర్పంచ్ ఐపీ బాంబు

- రూ.53 లక్షలు అప్పుఇచ్చి ఆదుకున్నవారికి పంగనామం
- బెదిరింపులకు తెగబడుతున్న వైనం


సీఎం చంద్రబాబుతో టీడీపీ సర్పంచ్ (ఫైల్)

సాక్షి టాస్క్ ఫోర్స్ : గ్రామ పంచాయతీ ప్రజలకు సేవ చేస్తాను అని చెప్పి సర్పంచ్‌గా గెలుపొందిన తర్వాత అధికారం, పలుకుబడిని అడ్డంపెట్టుకొని మోసపూరిత మాటలతో ప్రజల నుంచి అందిన కాడికి అప్పుల రూపంలో వసూలు చేశాడు. దాదాపు రూ.53 లక్షలకు పైగా వసూలు చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పు ఇచ్చి ఆదుకున్నవారికి ధనం తిరిగి ఇవ్వకుండా పంగనామం పెడుతూ ఐపీ బాంబ్ పేల్చాడు రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలంలోని అనంతంపల్లి సర్పంచ్ జయరామకృష్ణారెడ్డి అలియాస్ మురళి. ఎంతో కష్టపడి కూడబెట్టుకున్న డబ్బు నీకిచ్చాం.. మా డబ్బు మాకివ్వు అని అడిగిన వారిని 'ప్రభుత్వం మాది.. ఖబడ్దార్' అని బెదిరిస్తున్నాడంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబ నేపథ్యం..

పంచాయతీలో పలుకుబడిన కలిగిన కుటుంబం అని చెప్పుకుంటూ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ము కాయడం ఈ టీడీపీ సర్పంచ్ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య. ఆ విధంగానే ప్రస్తుతం మూడో పర్యాయం సర్పంచ్‌గా అందలం ఎక్కాడు. అధికారం అడ్డం పెట్టుకొని పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు.

అప్పు చేసి పప్పుకూడు..

ఈ సర్పంచ్ తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులే. విద్యార్థులకు నీతి పాఠాలు చెప్పే వీరు గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఖరీదైన 6 ఎకరాల 50 సెంట్ల తోపు పోరంబోకు స్థలాన్ని అడ్డదారిలో ఆక్రమించారు. గతంలో ఎర్రచందనం అక్రమ రవాణా చేసినట్లు కూడా సర్పంచ్ కుటుంబీకులపై ఆరోపణలు ఉన్నాయి. ఇదే సమయంలోనే పంచాయతీ పరిధిలో రహదారులు వేయకుండానే బిల్లులు చేసుకున్న ఘనత కూడా ఈ సర్పంచ్‌దే. ఇప్పటికీ కూటమి ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని పంచాయతీ పరిధిలో చేస్తున్న అవకతవకలకు అవధుల్లేవు. తాజాగా ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బులు చెల్లించకుండా రాజంపేట కోర్టులో రూ.52 లక్షలకు ఐపీ దాఖలు చేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

అరెస్టు ఉత్తర్వులు ఇచ్చినా ..

ఈ టీడీపీ సర్పంచ్ కష్ట కాలంలో తనకు అప్పు ఇచ్చి ఆదుకున్న వారిని నట్టేట ముంచేందుకు ప్రయత్నించడంతో పిండిబోయిన బసయ్య అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. కోర్టు బసయ్యకు అనుకూలంగా తీర్పునిస్తూ అతనికి రావాల్సిన నగదును అందజేయాలని ఆదేశించింది. లేని పక్షంలో జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చింది. అయితే అటు ప్రభుత్వ అండదండలతో ఇటు అధికారాన్ని అడ్డం పెట్టుకొని పుల్లంపేట పోలీసుల సహకారంతో ఈ టీడీపీ సర్పంచ్ కోర్టు తీర్పును తుంగలో తొక్కాడు. బసయ్యకు నగదు ఇవ్వలేదు, అలాగని జైలు శిక్ష అనుభవించలేదు. ఈ అక్రమాల సర్పంచ్ చర్యలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పగడాలపల్లిలో 45 గ్రాముల బంగారం చోరీ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని పగడాలపల్లిలో మద్దిన ప్రవీణ ఇంటిలో ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి తాళాలు పగులకొట్టి ఇంటిలోని బంగారం చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు.

సీసీ రోడ్డు కోసం వాగ్వాదం

సుండుపల్లె : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రోజు నుంచి కూటమి నాయకులు, కార్యకర్తల మధ్య విభేదాలు తలెత్తుతూనే ఉన్నాయి. మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా రూ. 1.50 కోట్లు మంజూరయ్యాయి. కూటమి నేత ల మధ్య వర్గ విభేదాల కారణంగా సీసీ రోడ్ల పనులు తమకు కావాలని ఒక వర్గం వారు, లేదు తమకు కా వాలని మరో వర్గం వారు పట్టుబట్టడంతో మండలం ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పీలేరు రూరల్ : ఐదుగురు జూదరులను అరెస్టు చేసి రూ. 20,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ యుగంధర్ తెలిపారు. మండలంలోని గూడరేవుపల్లె పరిసర ప్రాంతాల్లో మంగళవారం పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళ నిరసన

గాలివీడు : ఆక్రమణలో ఉన్న తమ నివాసాన్ని తమకు ఇప్పించి న్యాయం చేయాలని బొమ్మిశెట్టి రాజేశ్వరి అనే మహిళ తహసీల్దార్ భాగ్యలతను కోరారు. ఈ మేరకు బాధితురాలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని స్థానిక కార్పొరేషన్ బ్యాంక్ వద్ద నివాసముంటున్న బొమ్మిశెట్టి రమేష్ భార్య రాజేశ్వరి తమ నివాసాన్ని తన భర్త సోదరుడు ఆక్రమించుకున్నాడంటూ వాపోయింది. తమ నివాసం తమకు ఇవ్వాలంటే తమ పేరుమీద ఉన్న వ్యవసాయ భూమిని ప్రతిఫలంగా ఇవ్వాలంటూ తన బావ బెదిరిస్తున్నాడని ఆరోపించారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న రాజేశ్వరి

పాత పట్టాలపైనే గృహాలు మంజూరు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం చేనేత రాష్ట్ర అధ్యక్షుడు

గాలివీడు : పాత పట్టాలపైనే గృహాలు మంజూరు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం చేనేత విభాగం అధ్యక్షుడు ఓర్సు వీర భాస్కర్ కోరారు. మండల పరిధిలోని గోపనపల్లి గ్రామం చవడగడపల్లె గ్రామస్తులతో కలిసి సోమవారం తహసీల్దార్ భాగ్యలత, ఆర్ఐ బాలాజీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమకు గతంలో 477/2బి3 సర్వే నంబర్లలో ఒక్కొక్కరికి మూడు సెంట్లు చొప్పున పట్టాలిచ్చారన్నారు. వాటి స్థానంలో కొంతమంది గృహాలు నిర్మించుకున్నామన్నారు. ఇంకా కొంతమంది జీవనోపాధి కోసం వలస వెళ్లగా, కొంత మంది పునాదులు నిర్మించుకున్నారని తెలిపారు. ఇప్పుడున్న జాగాలోనే మళ్లీ గృహాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శి మారుతి శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు చల్ల రెడ్డయ్య, మండల అధ్యక్షుడు డి. శీను, దేవపట్ల రెడ్డప్ప, రామచంద్ర, రామాంజులు, శ్రీనాథ్, గణేష, వెంకటయ్య, కృష్ణ, నరసింహులు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో వెట్టిచాకిరీపై చర్యలు తీసుకోవాలి


డీఆర్ఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

రాయచోటి అర్బన్ : జిల్లాలోని కస్తూర్బా గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల చేత వెట్టిచాకిరీ చేయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సీపీఎం నేతలతో కలిసి కలెక్టరేట్‌లో డీఆర్ఓ మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పెద్దతిప్పసముద్రం, మొలకలచెరువు గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న ఆడిట్‌లో అనేక అక్రమాలు జరుగుతున్నట్లు వెల్లడికావడం దురదృష్టకరమన్నారు. పీటీఎం గురుకుల పాఠశాలలో ఎస్ఓ విద్యార్థుల చేత వెట్టిచాకిరీ చేయించుకోవడమే కాక విద్యార్థులను కులం పేరుతో తిడుతూ వేధింపులకు గురిచేస్తున్నట్లు విద్యార్థుల తల్లితండ్రులు ఆడిట్ కమిటీ ముందు వాపోయారన్నారు. మొలకల చెరువు గురుకుల పాఠశాలలో సైతం విద్యార్థులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారన్నారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరిశర్మ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను తొలగించడం దారుణం

ఓబులవారిపల్లె : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏపీఎండీసీ పాఠశాల టెండర్ లేకుండా లోపాయికారి ఒప్పందంతో కాంట్రాక్ట్ తీసుకున్న యాజమాన్యం నాన్ టీచింగ్ స్టాఫ్‌ను తొలగించడం దారుణమని వైఎస్సార్‌సీపీ నాయకులు, డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి విమర్శించారు. మంగళవారం ఏపీఎండీసీ పాఠశాల ఎదురుగా జరుగుతున్న ఉద్యోగుల రిలే నిరాహార దీక్షకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులను నిరుద్యోగులుగా మార్చే యత్నాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. దాదాపు మూడేళ్లకు పైగా ఏపీఎండీసీలో నాన్ టీచింగ్ స్టాఫ్ పనిచేస్తున్నారని వారికి ఎలాంటి నోటీసులు లేకుండా తొలగించడం ఏంటని ప్రశ్నించారు. ఏపీఎండీసీ గనుల విస్తరణలో ఇల్లు, భూములు కోల్పోయిన స్థానికుల కుటుంబాల వారే నాన్ టీచింగ్ స్టాఫ్‌లో పనిచేస్తున్నారని చెప్పారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా ఏపీఎండీసీ పాఠశాల కాంట్రాక్టు దక్కించుకున్న యాజమాన్యాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గల్లా శ్రీనివాసులు, బాధిత ఉద్యోగులు పాల్గొన్నారు.

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

రామాపురం : గ్రామీణ ప్రాంతాల పరిధిలో యువత ట్రాఫిక్ నిబంధనలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి మణికంఠ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా రామాపురం మండల పరిధిలో బిట్స్ కాలేజీ ప్రాంగణంలో రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా భారత ప్రభుత్వం, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం వల్ల విలువైన ప్రాణాలను కోల్పోకుండా కాపాడిన వారమవుతామని తెలిపారు. మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలలో 45 శాతం యువత హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయడం వల్ల మృత్యువాత పడుతున్నారని తెలిపారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, అతివేగం లాంటి వాటితో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. కళాశాల కరస్పాండెంట్ భాస్కర్ మాట్లాడుతూ యువత ఆవేశం తగ్గించుకొని ఆలోచన వైపు నడవాలన్నారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు, టోపీలు, ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేంద్ర, సురేంద్రారెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించండి


అద్దె బస్సుల యజమానులతో మాట్లాడుతున్న జిల్లా ప్రజారవాణాధికారి రాము

రాయచోటి అర్బన్ : ప్రయాణికులకు బస్సులలో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా ప్రజా రవాణాధికారి రాము అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన జిల్లా పరిధిలో ఉన్న ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ బస్సులను పరిశుభ్రంగా, మంచి కండీషన్‌లో ఉంచాలన్నారు. వీలైన మేర సౌకర్యాలను కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరిధిలోని పలు అద్దె బస్సుల యజమానులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు స్థలం పరిశీలించిన ఆర్డీఓ


పెట్రోల్ బంక్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

సంబేపల్లె : పెట్రోల్ బంక్ నిర్మాణపు స్థలాన్ని మంగళవారం రాయచోటి ఆర్డీఓ శ్రీనివాసులు పరిశీలించారు. మండల పరిధిలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి పక్కన రేగడకుంటపల్లె సమీపంలో పెట్రోల్ బంక్ నిర్మాణం కోసం స్థానికులు దరఖాస్తు చేసుకోవడంతో ఆర్డీఓ ఆ స్థలాన్ని పరిశీలించినట్లు తహసీల్దార్ సుబ్రమణ్యం రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవిశంకర్, సర్వేయర్ హరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు

గుర్రంకొండ : విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ ఇ.పసలవాండ్లపల్లెలో జరిగింది. ఎల్లుట్ల సచివాలయంలో ఎం. మన్సూర్ అలీ ట్రాన్స్‌కో లైన్‌మెన్‌గా ఆరేళ్లుగా పనిచేస్తున్నాడు. గత సోమవారం సాయంత్రం ఇ.పసలవాండ్లపల్లెకు చెందిన ఓ రైతు పొలంలోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురైంది. సదరు రైతు లైన్‌మెన్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో లైన్‌మెన్ ఎల్‌సీ తీసుకొని రైతు పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఇంతలో ఉన్నట్టుండి విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో రైతులు హుటాహుటిన మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. లైన్‌మెన్ పరిస్థితి నిలకడగా ఉందని ట్రాన్స్‌కో ఏఈ మాసిన్ తెలిపారు.